క్లుప్తంగా

ఎలుకలను సామూహికంగా నిర్మూలించాలి

అల్లవరం: వరి సాగులో ఎలుకల నిర్మూలనకు రైతులంతా సామూహికంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎలుకల నిర్మూలనకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యా ఫీజులు చెల్లిస్తాం..

యానాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఇటీవల సెంటాక్ ద్వారా 10 శాతం కోటాలో మెడికల్ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థుల ట్యూషన్ ఫీజును ప్రభుత్వమే భరిస్తుందని సీఎం రంగసామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 22 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు పొందారని, వారికి విద్యా ఫీజులు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు.

సీసీ కెమేరాల చోరీ

ఐ.పోలవరం: మురముళ్ల గ్రామ సచివాలయంలో సీసీ కెమేరాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనపై కార్యదర్శి రవిరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఈ పంచాయతీలో నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీకి గురయ్యాయి.

బాధితుడికి సాయం

తాళ్లరేవు: పంట చేలో పురుగు మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త పువ్వల గణేశ్వరరావును ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పరామర్శించారు. 19న గణేశ్వరరావు తన కౌలు పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురయ్యారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అతనికి శివన్నారాయణ ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు కూరాటి శ్రీకృష్ణ, దడాల వెంకటరమణ, దడాల సువర్ణలత, కోరుకొండ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేయూత

యానాం: ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు సామాజిక బాధ్యతగా స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాల విద్యార్థులు రూ.10 వేలను అందించారని ప్రిన్సిపాల్ మార్తాండ ప్రసాద్ తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థులను రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు అభినందించారు.

పెరిగిన ఆదాయం

యానాం: పుదుచ్చేరి రెవెన్యూ 30 శాతం పెరిగిందని కాగ్ గురువారం అసెంబ్లీలో నివేదికను విడుదల చేసింది. 2017-18లో రూ.6,003 కోట్లుగా ఉన్న ఆదాయం 2021-22 నాటికి రూ.7,859 కోట్లకు పెరిగిందని నివేదికలో పేర్కొంది.

రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో యండూరి ఐ బ్యాంకు వద్ద బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ప్రారంభించారు. సుమారు 50 మంది రక్తదానం చేశారని యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, యండూరి బ్లడ్ బ్యాంక్ చైర్మన్ యాండురి నాగేశ్వరరావు, డైరెక్టర్ వరద సూరిబాబు, నూలు రమేష్, వంకాయల కాశి, ఆకుల వీరబాబు, ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం



సందీప్ కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న ఏపీఎం రమణి

అమలాపురం రూరల్: క్యాన్సర్ బాధితుడికి దాతలు చేయూత అందించారు. కామనగరువు పంచాయతీ పరిధి చిట్టమ్మ చెరువుకు చెందిన దోనిపాటి సందీప్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఇప్పటికే అప్పులు చేసి వైద్యం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వైజాగ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న అమలాపురం మండల వీఓఏ సమాఖ్య సభ్యులు బాధితుడు సందీప్‌కు 1గురువారం రూ.18,500 సాయం చేశారు. ఈ మొత్తాన్ని ఏపీఎం పీవీవీ రమణి, వీఓఏ రోహిణి చేతుల మీదుగా అందజేశారు.

కౌలు రైతు ఖుషీ ఖుషీ

- నిజమైన సాగుదారులకే పథకాలు
- అర్హులందరికీ న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు



సమనసలో కౌలురైతు నుంచి ఈకేవైసీ తీసుకుంటున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు

అమలాపురం రూరల్: సిరులు పండిస్తున్న రైతన్నలకు ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోంది. భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలుదారులకూ మేలు చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతోంది. భూ యజమాని అంగీకారంతో కౌలుదారులకు సాగు హక్కు పత్రాలను అందిస్తోంది. తద్వారా వైఎస్సార్ రైతు భరోసా, బ్యాంకు రుణాలు తదితర వాటినీ రైతులతో పాటు కౌలుదారులకూ వర్తింపజేస్తోంది. దళారులు, అధిక వడ్డీదారులను నమ్మి మోసపోకుండా సహకార బ్యాంక్‌ల ద్వారా పంటపై వ్యక్తిగత రుణాలు ఇస్తుంది. భూమిని కౌలుకు తీసుకున్న కౌలురైతు ఆ భూ యజమాని నుంచి అంగీకార పత్రం తీసుకుంటే క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓ, వ్యవసాయ సహాయకులు పరిశీలన చేసి కౌలు సాగు హక్కు పత్రాలను మంజూరు చేస్తున్నారు. ఈ పత్రాలతో సహకార బ్యాంకుల్లో పంటపై రుణం పొందే అవకాశం కల్పించారు. కౌలుహక్కు పత్రాల పరిశీలన అనంతరం 11 నెలల కాలానికి ఎకరానికి రూ.35 వేల రుణాన్ని కౌలు రైతులకు మంజూరు చేస్తున్నారు. ఖరీఫ్ ఆరంభంలో తీసుకున్న పంట రుణం దాళ్వా పంట అనంతరం సహకార బ్యాంక్‌లకు వడ్డీతో పాటు చెల్లించాల్సి ఉంటుంది. అమలాపురం నియోజకవర్గంలో మొత్తం 4,157 మంది రైతులు ఉన్నారు. అల్లవరం మండలంలో 1,310 కౌలుదారులు సాగుహక్కు పత్రాలు పొందారు. ఇందులో 240 మందిరి తొలి విడతలో రూ.25 లక్షల రుణాలు అందించారు. అమలాపురం రూరల్‌లో 1,445 కౌలు కార్డుదారుల్లో 279 మంది రూ.55 లక్షల రుణాలు తీసుకున్నారు. ఉప్పలగుప్తం మండలంలో 1,393 మంది కౌలుదారుల్లో 145 మంది రూ.45 లక్షల రుణం పొందారు.

కొండంత 'భరోసా'

అర్హులైన కౌలుదారులకు భూ యజమానులకు అందిస్తున్నట్టుగానే వైఎస్సార్ రైతు భరోసా సాయం ఇస్తున్నారు. తొలి విడతలో ఒక్కొక్కరి ఖాతాలో రూ.7,500 చొప్పున జమ చేశారు. గత ప్రభుత్వంలో రుణ అర్హత కార్డులున్నా ప్రభుత్వ సాయం అందేది కాదు. పంట నష్టపోతే పరిహారం పొందేందుకు కౌలుదారులు ఇబ్బంది పడేవారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కౌలుదారులకు అన్ని రకాలుగా కొండంత అండగా నిలుస్తుంది. ఎస్సీ, బీసీ, ఎస్టీ కౌలుదారులకు వరుసగా ఐదో ఏడాది కూడా రైతు భరోసా అందించింది.

ఎంతో సంతోషంగా ఉంది



సమనసలో రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఇటీవల కౌలు హక్కు పత్రాలను పొందాను. ప్రభుత్వం నుంచి రూ.7,500 రైతు భరోసా సాయం నా ఖాతాలో పడింది. ఈ సాయం వ్యవసాయ పెట్టుబడికి ఉపయోగపడింది. కౌలు రైతులకు రైతు భరోసా మంజూరు చేయడం ఎంతో సంతోషంగా ఉంది.

– జనుపెల్లి బాబూరావు, కౌలు రైతు, సమనస

అర్హులందరికీ రుణాలు



అర్హులైన కౌలుదారులందరికీ రాష్ట్ర ప్రభుత్వం భూ యజమానులకు అందిస్తున్నట్టుగానే వైఎస్సార్ రైతు భరోసాతో పాటు బ్యాంకు రుణాలు ఇస్తుంది. అమలాపురం మండలంలో ఎస్సీ, ఎస్టీ రైతులు 192 మందికి రూ.7,500 చొప్పున రూ.14.40 లక్షలు అందించాం. మండలంలో కౌలు రైతులు రూ. 55 లక్షల వరకూ బ్యాంకు రుణాలు పొందారు.

– కదలి ధర్మప్రసాద్, మండల వ్యవసాయాధికారి, అమలాపురం

మహిళలకు రక్షణ కవచం దిశా చట్టం



కందికుప్పలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దిశా డీఎస్పీ మురళీమోహన్

కాట్రేనికోన: ఆపదలో ఉన్న మహిళలకు దిశా చట్టం రక్షణ కవచంలా పనిచేస్తుందని అమలాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. గురువారం కందికుప్ప జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్సై టి.శ్రీనివాస్ అధ్యక్షతన దిశా చట్టం-మహిళల సంరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో కందికుప్ప జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు దిశా డీఎస్పీ పలు చట్టాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ మొబైల్‌లో దిశా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. దిశా యాప్ నుంచి కాల్ చేసిన 10 నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. స్కూల్ హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు, దిశా ఏఎస్సై రసీద, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



అమలాపురం 13వ వార్డులో ఇంటింటా ఆరోగ్య సర్వే చేస్తున్న పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బులినాని

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి తొలి విడత ఇంటింటా సర్వే గురువారం ప్రారంభమైంది. మున్సిపాలిటీలోని 9 నుంచి 22వ వార్డుల వరకూ తొలి విడత సర్వే జరుగనుంది. ఈ 14 వార్డుల్లో ఆయా మున్సిపల్ కౌన్సిలర్లు వలంటీర్లతో కలసి ఇంటింటికి వెళుతున్నారు. ఎవరెవరికి ఎలాంటి రోగాలు ఉన్నాయనే వివరాలను ప్రాథమికంగా నమోదు చేస్తున్నారు. దీని ఆధారంగా ఏఎన్‌ఎమ్, ఆరోగ్య కార్యకర్తలు వచ్చి ఆ ఇంట్లోని కుటుంబీకుల వివరాల ప్రకారం వారిని ఏ ఆస్పత్రుల్లో చూపించాలన్న దానిపై నివేదిక తయారు చేస్తారు. సాధారణ వైద్యం అయితే పట్టణంలో రెండు అర్బన్ సెంటర్ల ద్వారా వైద్యం అందిస్తారు. 18వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, 13వ వార్డులో కౌన్సిలర్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినానితో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు తమ పరిధిలోని వలంటీర్లతో కలసి ఇంటింటా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఇప్పటికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై అధికారులు, కౌన్సిలర్లతో సమీక్షించారు.

ఓటరు జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జేసీ నూపుర్ అజయ్

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి గ్రామంలో ఇటీవల అధికారులు పరిశీలించిన ఓటర్ల జాబితాను జేసీ నూపుర్ అజయ్ గురువారం తిరిగి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా కొత్తగా నమోదైన, తొలగించిన, వేరే ప్రాంతం నుంచి చేర్చబడిన ఓటర్లను పరిశీలించారు. తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, వ్యవసాయాధికారి కుమార్‌బాబు, ఆర్‌ఐ ఎం.వెంకటరమణ, మండల కార్యాలయ ఏఓ మూర్తి, వీఆర్‌ఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సారథ్యంలో పల్లెల ప్రగతి

- వైఎస్సార్ సీపీ నేత శ్రీకాంత్
- ఉప్పలగుప్తంలో గడప గడపకూ..



ఉప్పలగుప్తంలో పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేత శ్రీకాంత్

ఉప్పలగుప్తం: సీఎం జగనన్న ప్రభుత్వంలో ప్రతి పల్లె ప్రగతి పథాన పయనిస్తుందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు, వైఎస్సార్ సీపీ నేత శ్రీకాంత్ అన్నారు. ఉప్పలగుప్తం గ్రామ సచివాలయం-2 పరిధిలోని పేరాయిచెరువు, ఆదిలక్ష్మీపురం ప్రాంతాల్లో గురువారం అధికారులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హుల ఇంటికే పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వివరించారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. పంట కాలువ నుంచి సాగు నీరు సక్రమంగా పారడం లేదని పలువురు తెలపగా, సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, పెయ్యల రమణ, యనమదల పల్లంరాజు, మోటూరి సత్యం కాపు, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, దాట్ల రాజేష్, దోనిపాటి వేణు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి దింపు కార్మికులను ఆదుకోవాలి

అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పొన్నాడ



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ముమ్మిడివరం: కోనసీమలో కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శెట్టిబలిజ కులస్తులు ఎక్కువగా ఆధారపడే కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల జీవన విధానాలపై విశదీకరించారు. కోనసీమలో ప్రధాన పంటగా ఉన్న కొబ్బరి ఆధారిత పరిశ్రమలపై వేలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. కొబ్బరి చెట్టుపై నుంచి కాయలు దింపు వరకూ కార్మికులు తరచూ ప్రమాదాలకు గురై మరణించడం లేక శాశ్వత వికలాంగులుగా మిగిలిపోవడం జరుగుతుందన్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కోనసీమలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. కొబ్బరి దింపు, ఒలుపు, ఎగుమతి, దిగుమతి కార్మికులకు 50 ఏళ్లకు పింఛన్లు అందజేసేలా చూడాలని కోరారు.

సత్తా చాటారు... పోటీలకు ఎంపికయ్యారు

యానాం: 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌కు పుదుచ్చేరిలో జరిగిన ఫేజ్-2 ట్రయల్స్‌లో యానాం నుంచి వివిధ క్రీడాంశాల్లో 20 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు శుక్రవారం ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు పాలికి ప్రకాష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాస్కెట్‌బాల్ పోటీలకు కర్రి మిథున్, వాలీబాల్‌కు పి.అక్షయ్, ఫుట్‌బాల్‌కు ఎం.అభిషేక్, ఎం.కృష్ణవంశీ, బ్యాడ్మింటన్‌కు కె.ముఖేష్‌కుమార్, బి.సూర్యకిరణ్, డీపీఎస్ మణికంఠ, హాకీకి కె.వీరబాబు, అథ్లెటిక్స్‌కు హర్షిత, వీఎస్ స్వాతి, బాల్ బ్యాడ్మింటన్‌కు కర్నేడి శివసత్యకిశోర్, కె.గౌతమ్‌నాయుడు, ఎ.హేమంత్‌కుమార్, లక్కవరపు దర్శన్‌కుమార్, కొల్లాటి ఈశ్వర్ సత్యసాయికుమార్, స్విమ్మింగ్‌కు ఎస్.లక్ష్మణ్, ఎం.శ్రీసునందన్, ఎస్.జిస్టేస్, క్రికెట్‌కు బి.రామకృష్ణ, బి.సాయి సంతోష్‌గోపాల్ ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు కొప్పనాతి భాస్కర్, రమేష్, సన్యాసిరావు, ఐవీకే మోహన్, చింతం రామకృష్ణ, చింతా వెంకన్న, వడ్డి వరప్రసాద్, శేరు విష్ణు, దుర్గారావు, బొట్టా శ్రీనివాసరావులను ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యానాం క్రీడాకారులు, చిత్రంలో పీఈటీలు

జిల్లా స్థాయి పోటీలకు గాడిలంక విద్యార్థులు

ముమ్మిడివరం: నియోజకవర్గ పరిధిలో జరిగిన పోటీల్లో గాడిలంక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.ఉదయభాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్ పోటీల్లో త్వరలో కాకినాడలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు తమ విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విజేతలను, వ్యాయామ ఉపాధ్యాయిని విజయకుమారిని సర్పంచ్, విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.



అమలాపురంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

16 మంది ఎంపిక

అమలాపురం రూరల్: బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు వివిధ పోటీలు జరిగాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ విభాగంలో ఎంపికలు నిర్వహించారు. నియోజకవర్గంలో స్కూల్ గేమ్స్ జిల్లా పోటీలకు 16 మందిని ఎంపిక చేశారని హెచ్‌ఎంలు రాజరాజేశ్వరీ, విజయకుమారి, పీఈటీ ప్రసాద్, గోవింద్, కుడుపూడి బుజ్జీ, సంజీవయ్య, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి తోట రవి తెలిపారు.

ఎమ్మెల్సీలకు అభినందన

అమలాపురం టౌన్: అమలాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీలుగా ఎంపికైన కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు గురువారం తొలిసారిగా శాసన మండలిలో అడుగు పెట్టినందుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. బీసీల నుంచి సూర్యనారాయణరావు, మాదిగ సామాజికవర్గం నుంచి ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసి శాసన మండలికి పంపించిన సీఎం జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలో శాసన మండలి భవనం వద్ద ఆ ఇద్దరి ఎమ్మెల్సీలకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపి మండలిలోకి పంపించారు.



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

తెరుచుకున్న రొయ్యల కంపెనీలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీలో రొయ్యల కంపెనీలతో వచ్చే వ్యర్థ జలాల కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారంటూ ఇటీవల పలువురు ఎంపీటీసీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మూడు రోజులుగా మూతపడిన రొయ్యల కంపెనీలు గురువారం తెరుచుకున్నాయి. తాళ్లరేవు రొయ్యల శుద్ధి కేంద్రాల నిర్వాహకులతో పాటు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను కలసి రొయ్యల కంపెనీ యజమానుల కష్టాలను తెలియజేశారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి తక్కువ ఖర్చుతో కూడిన శుద్ధి చేసే విధానం పొల్యూషన్ బోర్డు ద్వారా సూచిస్తామని తెలిపారు. రొయ్యల కంపెనీ యజమాని విత్తనాల కరిమల స్వామి, బొడ్డు సత్యనారాయణ, అంజిబాబు, సంగాడి రాజు, రామరాజు, కర్రి రాజు, విజయ్, ధర్మ, వేమా, రమణ దాసు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గురజాడ



గిరియాంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో గురజాడ జయంతి వేడుకలు

యానాం: తన రచనల ద్వారా సాంఘిక దురాచాలను రూపుమాపేందుకు మహాకవి గురజాడ అప్పారావు కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. స్థానిక గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్‌ఎం దంగేటి త్రిమూర్తులు అధ్యక్షతన గురజాడ అప్పారావు జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కాశి జానకిరాముడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధి కేవీవీ సత్యనారాయణ, టీచర్లు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు పోటీలు

ముమ్మిడివరం: గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. దీనికి హెచ్‌ఎం వీర హనుమంతరావు అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీహెచ్ పరిమళ, జనిపెల్ల సత్యనారాయణ, ఎస్.అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

జీసీఎస్‌లను సందర్శించిన ఎస్‌పీఎఫ్ కమాండెంట్

సఖినేటిపల్లి/ఆలమూరు: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) కమాండెంట్ కె.నరసింహరావు గురువారం జిల్లాలో పర్యటించారు. విజయవాడ నుంచి ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. తొలి పర్యటనలో భాగంగా ఆలమూరు – మండపేట రోడ్డులోని పెదపళ్లలోని ఓఎన్జీసీ గ్యాస్ కలెక్షన్ స్టేషన్(జీసీఎస్)ను, రాజోలు దీవిలోని మోరి, అడవిపాలెం జీసీఎస్‌లలోని గ్యాస్ కంప్రెషన్ ప్లాంట్ల(జీసీపీ)ను సందర్శించారు. ఆయనకు ఆయా ప్లాంట్లలో అధికారులు ఘన స్వాగతం పలికారు. మోరి ఓఎన్జీసీ సైటులో ఎస్‌పీఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మోరి, పెదపళ్ల సైట్లలో మొక్కలు నాటారు. ప్లాంట్ల భద్రతపై ఓఎన్జీసీ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎస్‌పీఎఫ్ సిబ్బంది పనితీరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ, ఏపీ సచివాలయం, శాసన సభ, హైకోర్టు, విమానాశ్రయాలు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, నగదు నిల్వ కేంద్రాలతో పాటు తిరుపతి, విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం వంటి ప్రధాన దేవాలయాలకు, ఓఎన్జీసీకి, ప్రముఖులకు, ప్రభుత్వ ఆస్తులకు ఎస్‌పీఎఫ్ భద్రత కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో డీఎస్‌పీఓ. కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. పెదపళ్లలో ఆయనను సిబ్బంది ఘనంగా సత్కరించారు.



మోరిలోని ఓఎన్జీసీ జీసీపీలో కమాండెంట్ నరసింహారావు

రూ.3 లక్షల రుణం ఇస్తామని.. రూ.38 వేలు కాజేశారు

అయినవిల్లి: ఆన్‌లైన్‌లో రుణం ఇస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, రూ.38 వేలు కాజేశాడని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. తొత్తరమూడి గ్రామానికి చెందిన నామాడి వాసుదేవరావుకు ఈ నెల 13వ తేదీన ఆన్‌లైన్ ద్వారా లోన్ ఇస్తామంటూ ఓ కాల్ వచ్చింది. ముందుగా రూ.38 వేలు చెల్లిస్తే రూ.3 లక్షల రుణం ఇస్తామని అవతలి వ్యక్తి నమ్మబలికాడు. అది నమ్మిన వాసుదేవరావు రెండు విడతలుగా రూ.38 వేలు ఫోన్‌పే చేశాడు. అయితే రుణం కావాలంటే మరో రూ.29 వేలు పంపించాలని అవతలి వ్యక్తి డిమాండ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన వాసుదేవరావు మోసపోయానని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ధాన్యం కొనుగోలుపై చర్చ

కాట్రేనికోన: సహకార సంఘాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సుధాసాగర్, జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు కందికుప్ప సహకార సంఘంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహకార సంఘాల (సీఐటీయూ) అధ్యక్షుడు తోట వెంకటరామయ్య, జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావుతో చర్చించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో శాఖాపరమైన సమస్యలు, టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్ల గౌరవ వేతనాలు, గోనె సంచుల నిర్వహణ, కమీషన్ బకాయిలపై మాట్లాడారు. సహకార సంఘాల రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ, జిల్లా కోశాధికారి బొబ్బ సుబ్రహ్మణ్యం చౌదరి తదితరులు ఉన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు

అమలాపురం రూరల్: వరి సాగులో సుడిదోమ, పాముపొడ తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్ వివరించారు. గురువారం పాలగుమ్మిలో మండల వ్యవసాయాధికారి కదలి ధర్మప్రసాద్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు తెగుళ్ల నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు- హెక్సాకొనాజోల్ 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి దుబ్బులు అడుగు భాగం పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. శుక్రవారం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమం జరుగుతుందని, వంద శాతం రాయితీపై ప్రభుత్వం ఎలుకల నివారణ మందు బ్రోమోడయోలిన్ పంపిణీ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పాలగుమ్మిలో వరి చేనును పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్